క్లుప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



తైక్వాండోలో క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని రాజరాజేశ్వరీ పాఠశాల ఆవరణలో గత నెల వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభించారు. గురువారం శిక్షణ ముగింపు సందర్భంగా 30 మంది క్రీడాకారులకు స్కూల్ ప్రిన్సిపాల్ రఘు సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. తైక్వాండో క్రీడా శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఛీఫ్ కోచ్ షబ్బీర్ హుస్సేన్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి


ఆర్‌బీకేలో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ

పాణ్యం : నంద్యాల జిల్లా పరిధిలోని ప్రతి ఆర్‌బీకేలో ఎరువులను అందుబాటులో ఉంచాలని నంద్యాల వ్యవసాయ శాఖ ఏడీ రాజశేఖర్ అన్నారు. గురువారం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పాణ్యం, గడివేముల, బనగానపల్లె మండలాల వ్యవసాయ అధికారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మట్టినమూనాలు సేకరించి వాటి ఫలితాలను రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ ఉషారాణి, గడివేముల ఏఓ హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్ఈకి ఘన సన్మానం


ఎస్ఈ సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతికి ఘన సన్మానం లభించింది. గూడూరుకు చెందిన ముస్లిం కాలనీలోని ఇళ్ల స్థలాల మధ్య వెళ్లిన విద్యుత్ లైన్ కారణంగా తరచూ ప్రమాదాలు జరగడంతో పాటు అక్కడ నివశించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు పలుమార్లు అధికారులను విన్నవించినా స్పందన లేదు. ఇటీవలే ఎస్ఈ ఉమాపతిని కలిసి ప్రజలు సమస్యను వివరించడంతో వెంటనే స్పందించారు. లైన్‌లను మరో చోటికి బదలాయించారు. సమస్య పరిష్కారం కావడంతో గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ అస్లాం, ముస్లిం పెద్దలు ఎస్ఈని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలను సకాలంలో పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న డీఈఈ, జెడ్పీటీసీ

కల్లూరు : విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని విద్యుత్ డీఈఈ సుబ్బన్న అన్నారు. గురువారం చిన్నటేకూరు సబ్‌స్టేషన్ ఆవరణలో కల్లూరు జెడ్పీటీసీ ఆల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, లో ఓల్టేజ్, జగనన్న కాలనీ గృహాలకు విద్యుత్ లైన్లు, కొత్త కనెక్షన్ తదితర విషయాలపై సమావేశంలో చర్చించారు. విద్యుత్ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి తెలిజేయ వచ్చన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఇంజినీర్ మహబూబ్ బాషా, లైన్ ఇన్‌స్పెక్టర్ స్వామిదాస్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి


సి.బెళగల్‌లో పీఎస్‌లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: ప్రజల సమస్యలను అక్కడికి అక్కడే పరిష్కరించాలని ఎంపీడీఓ రాముడు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి ఎంపీడీఓ మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, పీఎస్‌లు పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదలకు గృహ యోగం

- నియోజకవర్గ వ్యాప్తంగా 1668 గృహాలు మంజూరు
- 70 శాతానికి పైగా నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు
- ఉత్సాహంగా గృహ ప్రవేశాలు చేసుకుంటున్న వైనం


నిర్మాణాలు పూర్తయిన గృహాలు


కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో నిర్మితమవుతున్న గృహాలు

గూడూరు రూరల్: పేదల సొంటింటి కలను నెరవేర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఆయన అధికారంలోకి వచ్చిన ఏడాదికే దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల పేదలకు ఇంటి స్థలాల మంజూరు చేయడంతో పాటు గృహాలను నిర్మించేందుకు అవసరమైన ఆర్థిక చేయూతను అందిస్తున్నారు. ఇంటి నిర్మాణాలను చేపట్టిన లబ్ధిదారులకు సకాలంలో ఇసుక, సిమెంటు, స్టీల్ వంటి సామగ్రితో పాటు బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. దీంతో ఇప్పటికే కోడుమూరు నియోజకవర్గంలో పలు మండలాల్లోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రవేశాలను జరుపుకున్నారు.

ఆర్థిక సహకారం..

ఇంటి స్థల పట్టాలు పొందిన పేదలకు గృహ నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తక్కువ ధరకు అందజేయడంతో పాటు ఒక్కో ఇంటికి రూ. 1.80 లక్షల నిధులను ప్రభుత్వం అందజేస్తోంది. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు అదనంగా బ్యాంకు రుణం కింద రూ. 35,000 చొప్పున మంజూరు చేయడంతో ఉత్సాహంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు.

కోడుమూరు నియోజకవర్గ వ్యాప్తంగా మండలాల వారీగా ప్రభుత్వం కోడుమూరు మండలంలో 234 గృహాలను మంజూరు చేయగా 75 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 143 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా ఇప్పటి వరకు గృహ నిర్మాణాల కొరకు ప్రభుత్వం రూ. 1.76 కోట్లను ఖర్చు చేసింది. కర్నూలు రూరల్‌కు సంబంధించి 523 గృహాలు మంజూరు కాగా 286 గృహాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతుండగా ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 5.62 కోట్లను ఖర్చు చేసింది. సి.బెళగల్ మండలానికి 184 ఇళ్లు మంజూరు కాగా 97 నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలిన 159 నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 2.01 కోట్లను ఖర్చుచేసింది. గూడూరు మండలానికి 253 గృహాలు మంజూరు కాగా 160 గృహాలు పూర్తి కాగా 239 గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 3.16 కోట్లను ఖర్చుచేసింది. అలాగే గూడూరు మున్సిపాలిటీకి 474 గృహాలను మంజూరు చేయగా 356 గృహాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇందుకు ప్రభుత్వం రూ.9.58 కోట్లను ఖర్చు చేసింది.

80 శాతం మేరకు నిర్మాణాలు

కోడుమూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాల్లోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్, బిల్లులు పెండింగ్‌లో లేకుండా అందిస్తున్నాం. 80 శాతం మేరకు నిర్మాణాలు జరిగాయి. మిగిలిన వాటిని కూడా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకున్నాం.
– వాసుదేవరావు డీఈ హౌసింగ్ కోడుమూరు

కోడుమూరు నియోజకవర్గంలో గృహాల వివరాలు

మంజూరైన మొత్తం గృహాలు	- 1668
నిర్మాణాలు పూర్తయినవి	- 974
ఇప్పటివరకు ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం	- రూ. 22.13 కోట్లు

జగనన్న మేలు మరువలేనిది


ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో భర్త, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాను. ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. అర్హత కలిగిన నాకు ప్రభుత్వం సెంటుప్పావు స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణ పథకం మంజూరు చేయడంతో ఇంటిని పూర్తి చేసుకున్నా. ప్రస్తుత నా ఇంటి విలువ రూ. 12 లక్షలకు పైగా చేస్తుంది. ఈ కానుక ఇచ్చిన జగనన్నను ఎన్నటికి మరువలేను.
– సుజాత, కె.నాగలాపురం

ప్రభుత్వ సహకారంతో పూర్తి చేసుకున్నా


ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరుతో పాటు గృహ నిర్మాణ పథకాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి జాప్యంగా లేకుండా నిర్మాణాన్ని జరుపుకున్నా. అధికారులు ఎప్పటికప్పుడు బిల్లులు అందించడం కారణంగా త్వరితగతిన ఇంటిని పూర్తి చేసుకుని గృహ ప్రవేశం జరుపుకున్నాను. ప్రభుత్వం అందించిన తోడ్పాటు మరువలేనిది.
– చాకలి శ్రీనివాసులు, కె.నాగలాపురం

మట్టినమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపండి

కల్లూరు: రైతు భరోసా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ మట్టినమునాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం ఎ.గోకులపాడు గ్రామంలో మట్టినమునా సేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి వీఏఏ/వీహెచ్ఏ ఈ నెల 25 నాటికి మట్టినమునాలు సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

పాణ్యం : ఈనెల 23–25 వరకు గుంటూరులో జరగనున్న 1వ అంతర్ జిల్లాల బాలుర జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా బాస్కెట్‌బాల్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ వెంకటేష్ గురవారం తెలిపారు. క్రీడాకారులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు. ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో పోటీలు జరుగుతాయన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

సి.బెళగల్: ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలని, వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు గొల్లలదొడ్డి గ్రామస్తులను హెచ్చరించారు. గొల్లదొడ్డిలో వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామ పెద్దలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంతల మునెప్పతో కలిసి ఎంపీడీఓ రాముడు, ఎస్ఐ పీరయ్య. ఈఓఆర్డీ సందీప్ తదితరులు సమావేశమయ్యారు. సమస్యలపై చర్చించారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీష్, గ్రామ పెద్దలు తిరుమల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గ్రామస్తులు లోకేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

- జేడీ రామచంద్రయ్య


కార్యక్రమంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

సి. బెళగల్ : పాడి రైతులు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) రామచంద్రయ్య సూచించారు. గురువారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని స్త్రీ శక్తి భవన్‌లో మండల పశు వైద్యులు ప్రవీన్‌కుమార్, రోనాల్డ్ రీచర్డ్స్, సుంకన్న డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జేడీతో పాటు డీడీ దుర్గా ప్రసన్న బాబు, ఏడీ శివకుమార్ హాజరయ్యారు. జేడీ మాట్లాడుతూ పశుబీమా పథకం పాడిరైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, రేషన్ కార్డు ఉన్న పాడి రైతులు 20 శాతం ప్రీమియం తమ వాటాగా చెల్లించాలని, ఇతర రైతులు 50 శాతం చెల్లించి నమోదు చేయించుకోవాలన్నారు. పశువులు మృత్యేవాత పడితే 21 రోజులలోగా పరిహారం యాజమాన్యాల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు పరిహారం నగదు జమ అవుతుందని డీడీ, ఏడీ వివరించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ఓర్వకల్లు: రైతులు భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని జేడీఏ వరలక్ష్మి అన్నారు. బుధవారం నేల ఆరోగ్యం– మట్టి పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జేడీఏతో పాటు, ఏడీఏ శాలురెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం నుంచి 22 మట్టి నమూనాలను సేకరించాలన్నారు. అలాగే నీటి సదుపాయం భూముల్లో 2.50 ఎకరాలు, మెట్ట భూముల్లో 5 ఎకరాలలోపు మట్టి నమూనాలను సేకరించాలన్నారు. పీఎం కిసాన్, ఈకేవైసీ పెండింగ్ వివరాలను త్వరలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే కౌలు రైతుల కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మట్టి నమూనా కేంద్రం ఏఓ ఇందుమతి, సాంకేతిక ఏఓ సునీత, కర్నూలు ఏడీఏ సాంకేతిక ఏఓ దస్తగిరిరెడ్డి, ఏఈఓలు, వివిధ గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

రైతులకు అవసరమైన పనులు చేయండి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

గడివేముల: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రజలకు, రైతులకు అవసరమైన పనులను గుర్తించాలని ఏపీడీ బాలాజీ నాయక్ సూచించారు. గురువారం మండల పరిధిలోని బూజునూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మస్టర్లలో పనికి రాని వారి పేర్లు నమోదు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటరమణ,ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై విస్తృత ప్రచారం


సి.బెళగల్‌లో దిశ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పీరయ్య, పోలీస్ సిబ్బంది

సి. బెళగల్: మహిళలు, బాలికల సంరక్షణకు ప్రభుత్వం తీసుకొవచ్చిన దిశ యాప్‌పై గురువారం ఎస్ఐ పీరయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రం సి బెళగల్‌లో పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పోలీసులతోపాటు మహిళా పోలీస్‌లు ప్రధాన కూడళ్లలో ప్రజలకు దిశా యాప్‌పై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రజల సెల్ ఫోన్‌లలో దిశా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, యాప్ వినియోగం, ఆవశ్యకతను వివరించారు. ఒక్క రోజే 200 పైగా సెల్ ఫోన్‌లలో దిశా యాప్‌ను సిబ్బంది ఇన్‌స్టాల్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

గూడూరు: దిశ యాప్ మహిళలకు రక్షణ ఉంటుందని ఎస్ఐ పవన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ఎస్ఐ ఆధ్వర్యంలో మహిళా పోలీసులు దిశ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి మొబైల్ లో దిశ యాప్ ఉంటే మహిళలు ప్రమాదంలో ఉన్నప్పుడు యాప్ ద్వారా పోలీసులుకు తక్షణమే సమాచారం ఇవ్వాలని, తద్వారా రక్షణ పొందుతారని ఎస్ఐ తెలిపారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో గురువారం ఈఓఆర్డీ సందీప్ పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత, మంచినీటి నిర్వహణను పరిశీలించారు.

ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఈఓఆర్డీ ప్రజలకు సూచించారు. అదేవిధంగా సచివాలయాలను తనిఖీ చేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు


కోడుమూరులో విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు : చదువుతోనే పేద విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం కోడుమూరు బాలుర హైస్కూల్లో నియోజకవర్గ స్థాయిలో పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈడిగ గణేష్, గుడిసె మనోహర్, మనోహర్ రెడ్డి, తలారి మౌనిక, కాంచన, ప్రణతి, రమణిలకు జగనన్న ఆణిముత్యాలు అవార్డును, నగదు బహుమతిని ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో ఉన్నతంగా జీవించాలన్న లక్ష్యంతో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, విద్యా వసతి, విద్యాకానుక వంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రోత్సహిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా పాఠశాలలు తెరచిరోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కింద పుస్తకాలు, డ్రస్సులు, స్కూల్ బ్యాగులు మొదలగు వాటిని అందజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓలు అనంతయ్య, సునీలమ్మ, సర్పంచులు బాలకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, దిశ కమిటీ సభ్యులు రమేష్, అద్దుగల రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాణ్యంలో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

విద్యా వ్యవస్థల్లో సమూల మార్పులు

పాణ్యం : దేశ చరిత్రలోనే విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యానారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. గురువారం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పదో తరగతితో నియోజకవర్గంలో ప్రతిభ చూపిని లాల్ మహ్మద్, జి.భానుప్రకాష్, వీరేష్ నాయక్, భారత్‌నాయక్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కిరణ్‌కుమార్, మనోజ్‌కుమార్, హర్షిత్, శేషాద్రి, ప్రవల్లికలను సన్మానించి, నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, చెర్మన్ కవితారెడ్డి, ప్రిన్సిపాల్ రామన్, ఎంఈఓ కోటయ్య, ఎంపీడీఓ దస్తగిరి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

గూడూరు: ఆదోనిలో శుక్రవారం జరిగే ఓబీసీ బీజేపీ మోర్చ చైతన్య సదస్సును విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు బీజేపీ జాతీయ నాయకులు డాక్టర్ కే.లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు సోము వీర్రాజు, బిట్రా శివ నారాయణ, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపీనాథ్ తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పాణ్యం : మండలంలో ఖాళీగా ఉన్న ఎండీయూ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ బియ్యం పంపిణీ చేసేందుకు బీసీ–ఈ ఒకటి, ఎస్టీ ఒక చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. పిన్నాపురం, తమ్మరాజుపల్లె, కందికాయపల్లె గ్రామాల్లో రేషన్ పంపిణీ చేయుటకు బీసీ–ఏ కేటగిరీ ఒక పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఆసక్తి గల వారు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బీమా పథకాలపై అవగాహన

పాణ్యం: ఆర్‌బీఐ ప్రవేశపెడుతున్న బీమా పథకాలపై పొదుపు సంఘాల సభ్యులకు ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాణ్యంలోని పొదుపు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆర్ఎం మాట్లాడుతూ ఆర్‌బీఐ ప్రవేశ పెట్టిన జన్ సురక్ష పథకం ప్రయోజనాలు తెలుసుకోవాలన్నారు. ఎస్‌బీఐలో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష యోజన పథకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎస్‌హెచ్ఎం వసుంధర, పాణ్యం ఎస్‌బీఐ మేనేజర్ అల్లాబకాష్ పాల్గొన్నారు.

ఆవును ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడిన 1962


ఆవు, దూడను పరిశీలిస్తున్న సంచార పశువైద్యశాల సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ సంచార పశువైద్యశాల సిబ్బంది ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న ఆవును కాపాడారు. గూడూరు మండలం ఆర్.ఖానాపురం గ్రామానికి రంగస్వామి అనే రైతుకు చెందిన ఆవు బుధవారం రాత్రి నుంచి ఈనడానికి తీవ్ర ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో ప్రాణాపాయ పరిస్థితుల్లోకి వెల్లడంతో రైతు గురువారం ఉదయం టోల్‌ఫ్రీ నంబరు 1962కు ఫోన్ చేసి ఆవు పరిస్థితిని వివరించాడు.

ఈ సమాచారం గూడూరులోని వైఎస్ఆర్ సంచార పశువైద్యశాలకు రావడంతో వెంటనే వైద్య బృందం గ్రామానికి వెళ్లింది. ఆవును పరిశీలించి చికిత్స చేసి దూడను బయటికి తీశారు. ఆవుదూడ సురక్షితంగా ఉండటంతో రైతు ఊపిరి పీల్చుకున్నారు. 1962 ఫోన్ చేయడం వల్ల ఆవుకు సత్వర వైద్యం అందించి కాపాడటం హర్షనీయమని తెలిపారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు–పాలూరు గ్రామాల మధ్య ఇటివలనే బీటీ రోడ్డు వేశారు. అందులో భాగంగా టపాసుల గోడౌన్ నుంచి గ్రామం వరకు సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం పనులను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి పరిశీలించారు. వర్షా కాలం సమీపిస్తున్నందున పనులు వేగంగా జరుగుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. మరో మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

కల్లూరు : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ డీఈ ప్రభాకర్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. హౌసింగ్ డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి స్థలం మంజూరు చేసి, ఇళ్లు నిర్మించుకునేందుకు మెటిరియల్‌ను అందిస్తుందన్నారు. ఇంటి స్థలం వచ్చిన లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకునేల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవి రమణమూర్తి, హౌసింగ్ ఏఈ కృష్ణమూర్తి, ఈఓఆర్డీ రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేల ప్రజలకు అవగాహన కల్పించాలని ఈఓఆర్డీ రవికిషోర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ ఆగష్టు 15 నాటికి ప్లాస్టిక్‌కు నిషేధించాలన్నారు. వాతావరణం మార్పులతో గ్రామాల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇంటర్ విద్యార్థినికి సన్మానం

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ కళాశాలలో ఇంటర్ సీఈసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని రమణిని గురువారం ప్రిన్సిపాల్ దిల్షాద్, ఎంఈఓ సునీలమ్మ సత్కరించారు. రమణి సీఈసీ గ్రూపులో వెయ్యికి గాను 841 మార్కులు సాధించింది. విద్యార్థినికి నగదు పురస్కారంగా రూ. 15వేలతో పాటు జ్ఞాపికను అందించి సత్కరించారు.


రమణిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్, ఎంఈఓ

పేద పిల్లల భవిష్యత్తును సీఎం బాధ్యతగా తీసుకున్నారు

- నగర మేయర్ రామయ్య
- 19వ వార్డులో జగనన్న కానుక పంపిణీ


విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న మేయర్

కల్లూరు: పేదింటి పిల్లల భవిష్యత్తును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతగా తీసుకున్నారని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్ నగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ రామయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు జేవీకే కిట్లను అందజేశారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదింటి పిల్లలు ప్రపంచాన్ని ఏలాలి అనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి విద్యా వ్యవస్థకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పిల్లల చదవులకు తల్లిదండ్రులు ఇబ్బందులకు గురి కాకూడదనే అమ్మ ఒడి పథకంతో ఏడాది రూ. 15వేలు తల్లుల ఖాతాలో జమచేస్తున్నామన్నారు. మనబడి నాడు–నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మారి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాం, దేవపూజ ధనుంజయ ఆచారి, యూనూస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు భరోసా

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం రేమట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ అజంఖాన్ జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సంపత్, సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సునంద తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించారు. గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంఈఓ కోటయ్య, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు.